# నోర్మూయ్

ఈ మాట పదే పదే చెవుల్లో వినపడుతుంటే భరించలేక చెవులు కూడా మూసుకుంది జానకి. ఈ మాటతో పరిచయం ఒక్కనాటిది కాదు. ఒక సంవత్సరానిదీ కాదు. ఊహ తెలిసిన క్షణం నుంచీ ఎప్పుడూ ఎవరో ఒకరు జానకిని ఈ మాట అంటూనే వున్నారు.

చిన్నతనంలో ఎక్కడ ఏం చూసినా, ఏం జరిగినా పట్టలేని సంతోషమో కోపమో బాధో కలిగేవి. వాటిని అమ్మకో నాన్నకో చెప్పాలని పరిగెత్తేది. తన ఆవేశాన్నంతా ప్రదర్శిస్తూ చెప్పబోతే వాళ్ళు వెంటనే —

"నోరు మూసుకుని అవతలకు నడువు, ఎక్కడలేని సంగతులూ నీకే కావాలి" అని కసిరేవాళ్ళు.

అమ్మా నాన్నలే కాదు. అమ్మమ్మ, తాతయ్య, నాయనమ్మ, అత్త, పిన్ని, మామయ్య, బాబాయి అందరూ అంతే.

"ఎందుకట్లా వాగుతావు" అనేవారు.

"ఆడపిల్లకంత నోరు పనికి రాదు" అనేది అత్త ఎంత నోరు తనది?

వెళ్ళి అద్దంలో చూసుకుంటే ఎర్రని పెదవులతో బుల్లి నోరు కనిపించింది. ఇంత చిన్న మూతిని పట్టుకుని ఎందుకలా అంటుంది?

ఇంత చక్కని మూతి మీద వాత పెడతానని అమ్మ ఎందుకంటుంది?

ఆడపిల్లలకు నోరు ఎందుకుండకూడదు?

అన్నలూ తమ్ముళ్ళూ ఊరిమీద పడి తిరుగుతుండేవారు. అన్నాల వేళకొచ్చి అన్నం తినడం, నిద్రపోవడం. వాళ్ళు బయట తిరిగి ఆడేటప్పుడు హాయిగా అరుచుకుంటారు. మాట్లాడుకుంటారు.

అన్నలు కాలవలో ఈతకి దూకుతూ ఎల్లా అరుస్తారనీ..!

జానకి ఒక రోజు పెరట్లో తొట్టి నిండా నీళ్ళు వున్నప్పుడు, తొట్టి అంచుమీద నిలబడి పెద్దగా అరుస్తూ తొట్లోకి దూకింది.

తొట్లో నీళ్ళన్నీ ఆనందంతో చిందులేసేసరికి జానకి సంతోషం పట్టలేక మరి రెండు కేకలేసింది. గట్టిగా గొంతు నరాలు పొంగేలా అరిచింది.

నాయనమ్మా, నాన్నా ప్రత్యక్షమయ్యారు.

నాన్న ముఖం అసహ్యంగా చేసుకుని జానకిని తొట్లోంచి ఎత్తి బైటపడేశాడు. బట్టలు లేని జానకిని చూసి చీదరించుకుంటూ "సిగ్గు లేదు" అని తిడుతూ వెళ్ళిపోయాడు. అన్ననూ తమ్ముళ్ళనూ కాలవకి స్నానానికి తీసికెళ్ళి వాళ్ళు బట్టలు విప్పుకుని ఈత లేస్తుంటే నవ్వి నవ్వి, అలసిపోయే నాన్న!

తనను కాలవకెలాగూ తీసికెళ్ళడు. ఇంట్లో తొట్లో దిగకూడదూ? అప్పుడు బట్టలెందుకు? ఈమాటే నాయనమ్మ నడిగితే వీపు మీద రెండు అంటించి "నోరు మూసుకోవే సిగ్గుమాలిన దానా" అన్నది.

మాటలు నోట్లో నుంచి వస్తున్నాయేగాని అసలు పుట్టడం తలకాయలో నుంచి పుడుతున్నాయని వయసు వస్తున్న కొద్దీ జానకి గ్రహించింది. అందుకే —

"నీ నోరు కుట్టెయ్యాలి" అని అత్త అంటే. జానకి పకపకా నవ్వింది.



ఓల్గా

"నీకు తెలియదా? మాటలు పుట్టేది ఇక్కడ. నోట్లో నుంచి వస్తున్నాయంతే" అని తలకాయ మీద కొట్టుకుంది.

"నీ తెలివి మండినట్టే వుంది" అని వీపు మీద దబ దబా బాదింది అత్త.

తలకాయలో మాటలు పుడుతున్నప్పుడు వాటిని వెంటనే బైటికి రానీయకూడదనీ, కొన్నింటిని అసలు రానీయకూడదనీ జానకికి ఆలస్యంగానైనా అర్థమయింది.

మాటల సంగతి సరే — తన మాటలు పెద్ద వాళ్ళకు అర్థం కావు. కోపం వస్తుంది. వాళ్ళ మాటలకు తనకు ఏడుపొచ్చినట్టే తన మాటలకి వాళ్ళకూ కోపం వస్తుందేమో.

కానీ నవ్వు — నవ్వేం చేసింది?

నవ్వితే ఎవరికైనా బాధ ఎందుకు? కోపం ఎందుకు? అందునా జానకికి నవ్వు పెదవుల మీదనే వుంటుందా అన్నంత తొందరగా వచ్చేస్తుంది. ఇంటా బయటా ఎన్నో చిత్రాలు! ఎన్నో తమాషాలు! అన్నిటికీ నవ్వు వస్తుంది. ఎట్లా ఆపాలి? నవ్వు వచ్చేవన్నీ ఎదురుగా కన్పిస్తున్నా నవ్వకూడదు!

నవ్వితే కొడతారు గదా? కొడితే నొప్పేస్తుంది గదా? నొప్పికి ఏడుపొస్తుందా — ఏడవగూడదు.

నొప్పి పుట్టేలా కొట్టి ఏడవ వద్దంటున్న పెద్దాళ్ళను చూసి ఆశ్చర్యపోయేది జానకి. "కొట్టక పోతే ఏడవనుగా" అనడిగింది ఒకసారి తండ్రి

స్త్రీ పురుషుల మధ్య వున్న అసమానత సామాజిక జీవనంలోని అన్ని అంశాలలోకి చొరబడింది. ఆఖరికి భాషలో మాటల అర్థాలు కూడా మారిపోయాయి. 'నోర్ముయ్' అని మగవాడు మరో మగవాడిని అంటే ఒక రకం అర్థమూ, స్త్రీని అంటే మరొక రకం అర్థమూ వుంటుంది. నిజానికి యీ 'నోర్ముయ్' అణచివేతకి వ్యతిరేకంగా నోరు మరింత తెరవాల్సి వుంటుందని, అణచివేతకు గురవుతున్న వాళ్ళకు తెలీకుండా ఆపడం ఎవరి తరం?

తమ్ముడ్ని కొట్టి ఏడవవద్దని గదుముతుంటే.

"నువ్వు నోరు మూయకపోతే నీకు పడతాయి. వెధవ ప్రశ్నలని వెధవ ప్రశ్నలు. ఏం లేకపోయినా నోరొకటి ఇచ్చాడు దేవుడు" నాన్న కోపం ఇలు తిరిగింది.

దేవుడు నోరిచ్చాడు. నోటితో మాట్లాడ తారు, నవ్వుతారు, ఏడుస్తారు.

మరి ఇదేమీ చెయ్యొద్దంటారెందుకు? ఇవన్నీ చెయ్యకూడనివైతే దేవుడు నోరివ్వడం ఎందుకు? జానకి చిన్ని బుర్ర అంతకు మించిన ఆలోచన భరించలేక పోయేది. ఎదురుగా కనపడుతున్న ఏ చెట్టునో పుట్టనో పట్టుకుని ఈ విషయం వది లేసేది.

జానకికి క్రమంగా ఎన్నో చిత్రమైన విషయాలు తెలిశాయి.

ముందు చిన్న పిల్లలను పెద్దవాళ్ళు నోరు ముయ్యమంటారని అర్థమైంది.

తర్వాత చిన్న పిల్లల్లో కూడా ఆడ పిల్లలు ఎక్కువ సార్లు నోరుమూసుకోవాలని అర్థమైంది. ఐతే ఊహ పెరిగే కొద్దీ పెద్ద ఆడవాళ్ళను కూడా మగవాళ్ళు నోరుముయ్యమంటారని తెలిసింది. నాన్న అమ్మా, నాయనమ్మలను చాలాసార్లు 'నోరు మూసుకోండి' అనేవాడు. ఆడ పిల్లలు పెద్దయినా తోటి ఆడవాళ్ళతోనే మెల్లిగా మాట్లాడాలి గానీ మగాళ్ళ దగ్గర నోరు మూసుకునే వుండాలి అనుకుంది జానకి. ఐతే జానకి ఇంకో మహా చిత్రమైన విషయం కనిపెట్టింది.

నాన్నా, అమ్మా- ఒకరేమిటి ఇంట్లో ఆడా మగా పిల్లలతో సహా అందరూ అందరికంటే పెద్దాడైన ఎంకటి గాడిని నోరుమూసుకోరా అంటారు. జానకి ఒకోసారి తను కూడా వెంకటిని 'నోరుమూసుకో' అని అందామని చాలాసార్లు అనిపించింది.

కానీ ఎంకటి జానకితో చాలా మంచి కబుర్లు చెప్పేవాడు.

దూడలు అరిస్తే వాటి భాషలో అవి ఏమంటు న్నాయో చెప్పేవాడు. పిట్టలు జామ చెట్టు మీద మీటింగ్ పెట్టుకుని ఏం మాట్లాడు కుంటు న్నాయో చెప్పేవాడు. మబ్బులు తొందర తొందరగా ఇళ్ళకెందుకు పరిగెత్తుతున్నాయో చెప్పేవాడు. మబ్బులు పొట్టల్లో నీళ్ళు పెట్టుకుని గబగబా ఇంటికి పరిగెత్తి కుండల్లో నింపు కోవడం, ఇల్లు చేరలేకపోతే ఆ నీళ్ళన్నీ కారిపోయి వర్షంగా కురవడం ఎంకటి చెబుతుంటే నోరు తెరుచుకుని వినేది జానకి. 'నోరుముయ్ ఏంటా వాగుడు' అనాలని మర్చిపోయేది.

మళ్ళీ ఎంకటిగాడు చెప్పే ఆ మాటలే అమ్మకో, నాన్నకో చెప్పబోతే వాళ్ళు జానకిని 'నోరుమూసుకో' మనే వాళ్ళు. బీదవాళ్ళనీ, తక్కువ కులం వాళ్ళనీ, ఆడాళ్ళనీ నోరుముయ్యమని అంటారని జానకి గ్రహించింది.

అప్పట్నుంచి జానకి అతి తక్కువ మాట్లాడడం ప్రయత్నపూర్వకంగా అలవరుచుకుంది.

ఒళ్ళో, ఇంట్లో నోరు విప్పకుండా పనులు చేయడం నేర్చుకుంది.

జానకిని అందరూ మెచ్చుకున్నారు.



తలకాయలో పుట్టే మాటలను ఆపెయ్యడం కోసం కృషి చేసిన జానకి తన తలకాయలో మాటలు పుట్టడం క్రమంగా తగ్గిపోతోందని గ్రహించలేకపోయింది. మాట్లాడకుండా వుంటే తనలో కలిగే అశాంతి క్రమంగా తగ్గిపోతోందని సంతోషించిందే కాని తనకున్న ఊహాశక్తి పోతోందని తెలుసుకోలేకపోయింది.

చిన్నతనంలో వాడిన కొమ్మలమా రాలిన పువ్వులనూ చూసి వాటి కోసం బాధపడి వాటి దుస్థితిని నలుగురికీ చెప్పాలని ప్రయత్నించే జానకి ఈవాళ తన ఎదురుగా మనుషులు బాధపడుతున్నా ఏమీ మాట్లాడలేని దుస్థితికి వచ్చింది. నిశ్శబ్దంగా ఏడవడం తప్ప ఏమీ చెయ్యలేకపోతోంది.

పిట్టల అరుపులకూ, లేగ దూడల గంతులకూ చిందులు వేసే జానకి ఇప్పుడు తన ఎదురుగా ఎంత సంబరం జరుగుతున్నా చిరునవ్వుతో నిశ్శబ్దంగా నిలబడడం నేర్చుకుంది.

జానకికి పెళ్ళయింది. వరుడు అందగాడు. మంచి ఉద్యోగస్తుడు. జానకి తనలో తాను మురిసి పోయింది.

అయితే ఆ మురిపెం పోయి దాని స్థానంలో భయం ప్రవేశించడానికి ఎంతో కాలం పట్టలేదు.

"ఏంటా మూపులు- ముంగిలా మాట్లాడవేం" జానకి భర్తకు జానకి మౌనంతో చిరాకు వచ్చేది. ఏం చెప్పినా విని ఊరుకునే జానకి, బదులివ్వకుండా చెప్పిన పని చేసే జానకి అతనికి చాలా అసహనం కలిగించింది.

తన భర్తకు మాటలూ కబుర్లూ కావాలని అర్థమయ్యేసరికే జానకి చెంపలు వాచిపోయాయి. జానకి మళ్ళీ మాటలు నేర్చుకోవడం మొదలు పెట్టింది. నోరు విప్పడం మొదలు పెట్టింది. తనకు కలిగిన ప్రతి అనుభూతినీ మాటల్లో చెప్పడం ఒకప్పుడెంతో తేలికగా వుండేది.

ఇప్పుడలా కాదు.

ఇప్పుడు మాటల కోసం యుద్ధం చేయవలసి వస్తోంది.

మెదడులో యుద్ధం, గొంతులో యుద్ధం, నాలుక మీదా, పెదవుల పైనా యుద్ధం. ఈ యుద్ధంలో అపజయం కలిగినా అలసట కలిగినా జానకి ప్రయత్నం మానలేదు.

నెమ్మది నెమ్మదిగా నడకరాని బుడతడు పడుతూ లేస్తూ నడక నేర్చినట్టు మాటలు నేర్చింది. జానకిలో మార్పుకి భర్త కూడా సంతోషించాడు.

జానకి అతనికేం కావాలో, అతని ఇష్టాలేమిటో అడిగి కనుక్కుంటున్నప్పుడూ, అతని ఇష్టాలు తీరుస్తానని చెబుతున్నప్పుడూ అతను చాలా సంతో షించాడు.

అతని పనులనూ ప్రవర్తననూ అందాన్నీ జానకి ముచ్చటైన మాటల్లో మెచ్చుకుంటుంటే అతను నిజంగానే సంతోషించాడు. ఐతే జానకి మాటలు అంతటితో ఆగలేదు. జానకి చిలక కాదు. మనిషి. జానకి మరికొన్ని విషయాలు అడగడం మాట్లాడడం మొదలుపెట్టేసరికి భర్తకు మళ్ళీ చిరాకు మొదలయింది.

కనుబొమ ముడితో ప్రారంభమైన ఆ చిరాకు క్రమంగా జానకి మాటలతో పాటు పెరిగింది. ఒకానొకరోజు బద్దలయింది.

## "నోర్మూయ్ -ఆడదానికంత నోరు పనికి రాదు" "ఆడదానివి నోరు మూసుకుని పడుండు"

భర్త ఈ మాటలన్న రోజు జానకి పిచ్చిగా నవ్వింది. కళ్ళల్లో నుండి నీరు కారేలా నవ్వింది. నవ్వి నవ్వి నిలబడలేక మంచం మీద పొర్లింది. "ఏంటా విపరీతపు నవ్వు ఆడదానివేనా?"

జానక్కి నవ్వాగడం లేదు.

ఆ నవ్వు ఏడుపుగా మారేవరకూ ఆగదు కూడా.

## "నోర్మూయ్ - నోర్మూయ్"

జానకి చెవుల్లో ఆ మాట మారుమోగుతోంది. చెవులు మూసుకున్నాసరే-

ఆ మాట చెవుల ద్వారా వచ్చినప్పటికీ తలకాయలో పుట్టింది. రక్తంలో ఇంకింది. ●